క్లుప్తంగా

రూ.లక్ష విరాళం అందజేత



నెల్లూరు(బృందావనం): రామలింగాపురానికి చెందిన శ్రీధర్‌రెడ్డి– కావ్య దంపతులు రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిత్య అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డికి అందించారు.

పారిశుద్ధ్య సమస్యలపై నిరసన



నెల్లూరు సిటీ : నగరంలోని నారాయణరెడ్డిపేటలో డ్రెయినేజీ, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలంటూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా, సీపీఐ నేతలు షాన్‌వాజ్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, రమణయ్య, చెంచమ్మ, భారతి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయం.. బిర్సా జీవితం



ర్యాలీలో పాల్గొన్న మేయర్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : బిర్సా ముండా జీవితం గిరిజనుల పోరాట పటిమకు నిదర్శనమని, ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని మేయర్ స్రవంతి అన్నారు. బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని ఐటీడీఏ ఆధ్వర్యంలో నగరంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. తొలుత ఐటీడీఏ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ పరిమళ, ఏపీఓ జోత్స్న, శారదా, శాంతి, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని 18 పంచాయతీల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేస్తామని ఎంపీడీఓ శైలేంద్రకుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శుక్రవారం సమావేశం జరిగింది. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఎంపీపీ విజయకుమార్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్) : సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్సై బాలకృష్ణ శుక్రవారం సంతపేట పోలీసుస్టేషన్ పరిధిలో సింగల్ నంబర్లాటపై దాడులు చేశారు. పాత మున్సిపల్ ఆఫీసు సమీపంలో సింగల్ నంబర్లు రాస్తున్న, ఆడుతున్న గోపిటీ సెంటర్ ప్రాంతానికి చెందిన షేక్ సుల్తాన్, మున్సిపల్ ఆఫీసు ప్రాంతానికి చెందిన రమేష్, ఈద్గామిట్టకు చెందిన షేక్ వహీద్, కొడవలూరుకు చెందిన ఆంతోనిలను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.13,190 నగదును స్వాధీనం చేసుకున్నారు.

హరహర మహాదేవ

పవిత్ర కార్తీక పౌర్ణమి రాకతో సింహపురి పులకించింది. నగరంలోని ఉమామహేశ్వరుల సన్నిధులు శుక్రవారం కార్తీక పౌర్ణమి శోభతో కళకళలాడాయి. 'హరహర మహాదేవ శంభోశంకర' నామస్మరణతో భక్తులు శివపార్వతులకు ప్రణమిల్లారు.

- సింహపురిలో కార్తీక వైభవం
- కిటకిటలాడిన శివపార్వతుల నెలవులు



రాజరాజేశ్వరి దేవస్థానంలో నారాయణస్వామి వ్రతంలో భక్తులు



నరసింహకొండపై..



వెంకటేశ్వరపురంలో..



నారికేళ జలంతో అభిషేకిస్తున్న అర్చకులు



చండీహోమం జరిపిస్తున్న అర్చకులు

నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్లకు విశేష పుష్పాలంకరణ, ప్రాకారోత్సవం, చంద్ర దర్శనం, జ్వాలాతోరణం నిర్వహించారు. నవాబుపేటలో మల్లేశ్వరస్వామి దేవస్థానం, సీఏఎం ఉన్నత పాఠశాల దగ్గర ఉమామహేశ్వర ఆలయం, క్రాంతినగర్‌లోని శివకేశవుల ఆలయం, పప్పులవీధిలోని పంచభూతేశ్వర స్వామి ఆలయం, సంతపేట ములుముడి బస్టాండ్ సమీపంలో ఉన్న భ్రమరాంబ సమేత హరిహరనాథ ఆలయం, బాలాజీనగర్‌లోని సీతారామ స్వామి మందిరంలో 1008 ప్రమిదలతో సహస్ర జ్యోతిర్లింగార్చన, వేదాయపాళెంలోని కృష్ణమందిరం ప్రాంగణంలో శంకరస్వామికి విశేష పూజలు నిర్వహించారు.

➡ వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామికి అభిషేక మహోత్సవం శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి 108 కొబ్బరిబోండాలు(నారికేళ జలం)తో అభిషేక మహోత్సవాన్ని అర్చకుడు బృందావనం శ్రీనివాసదీక్షితులు చేశారు. తొలుత నిర్వాహకులు కర్తం ప్రతాప్‌రెడ్డి– జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో 108 కొబ్బరిబోండాలను భక్తులు శిరస్సుపై ఉంచి మందిరం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అమ్మవారి పాదాల వద్ద ఉంచిన చీరలను లక్కీడిప్ ద్వారా 13 మందికి అందజేశారు.

➡ మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితులు, అర్చకులు నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. మఠం ప్రాంగణంలో కొలువైన కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా పైడపాటి హేమసుందర్ దంపతులు వ్యవహరించారు. నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్– ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

➡ నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈఓ జనార్దన్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

➡ నెల్లూరు సిటీ : నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉత్సవ మూర్తులకు అభిషేకం, చిన్న గరుడ సేవ కార్యక్రమాలు జరిగాయి. ఉభయకర్తలుగా ఆంజనేయప్రసాద్– ఇందిర దంపతులు వ్యవహరించారు. ఈఓ గోపి, అర్చకులు భాస్కరాచార్యులు, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

➡ నెల్లూరు(వీఆర్సీసెంటర్) : వెంకటేశ్వరపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు సహస్ర దీపాలంకరణ చేశారు. ఉభయకర్తలుగా కోటారెడ్డి– దేవసేనమ్మ దంపతులు, శ్రీనివాసన్– హనుమాయ దంపతులు వ్యవహరించగా అర్చకుడు సాయిభరద్వాజ పర్యవేక్షించారు.

దేదీప్యం.. కార్తీక దీపోత్సవం



స్వర్ణాల చెరువులో కార్తీక దీపాలు వదులుతున్న భక్తులు

- భక్తజనంతో కళకళలాడిన గణేష్ ఘాట్



ఆశీర్వచనం చేస్తున్న రమ్యానందభారతి మాతాజీ

నెల్లూరు(బృందావనం) : నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం దగ్గర గణేష్ ఘాట్ దీపకాంతుల్లో మెరిసిపోయింది. కార్తీక దీపకాంతులతో కళకళలాడింది. మహా కార్తీక దీపోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వర్ణాల చెరువు వద్ద ఉన్న స్వర్ణలింగేశ్వరస్వామి దేవస్థానంలో భువనేశ్వరి పీఠాధిపతి రామానందభారతిస్వామి ఆశీస్సులతో గోపూజ, తాత్కాలిక రామలింగేశ్వర ప్రతిష్ట మహాసంకల్పం నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు అర్చనలు చేపట్టారు. వేద పండితులచే గణపతి, వరాహ, రుద్రహోమం, పూర్ణాహుతి గావించారు. మహా దీపోత్సవంలో భాగంగా సాయంత్రం 1008 మంది మహిళలతో కార్తీక దీపోత్సవ శోభాయాత్ర చేపట్టారు. అనంతరం జ్వాలాదీపం, ఆకాశదీపం వెలిగించారు. అనంతరం హరిద్వార్ నుంచి వచ్చిన పండితులతో గంగాహారతి నిర్వహించారు. 108 తెప్పలతో శివాకృతి పూజలను ఘనంగా చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో పుణ్యనదుల నుంచి తీసుకొచ్చిన పవిత్ర జలాన్ని డ్రోన్‌ల ద్వారా సంప్రోక్షణ నిర్వహించారు. కార్యక్రమాలను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కార్తీక దీపోత్సవ సమితి నిర్వాహకులు డాక్టర్ వెన్నెల బయ్యా మల్లిక, కోడూరు జయప్రద, కె.జయరామ్, పి.సురేంధర్‌రెడ్డి, ముక్కాల వ్యాసప్రసాద్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ పాల్గొన్నారు

➡ ఆధ్యాత్మిక ప్రవచనంలో భాగంగా రమ్యానందభారతి మాతాజీ ఆశీర్వచనం చేశారు. కార్తీక దీపోత్సవ విశిష్టత, శివకేశవుల తత్వాన్ని వివరించారు.

అనంతరం భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గీతాగాన, ప్రవచన ప్రచారకర్త డాక్టర్ ఎల్వీ గంగాధరశాస్త్రి ఉపన్యసించారు.

గొలగమూడికి పాదయాత్ర రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం) : పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం నుంచి గొలగమూడిలోని వెంకయ్యస్వామి సన్నిధికి ఆదివారం ఉదయం 6 గంటలకు పాదయాత్ర చేపట్టనున్నట్లు మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను మందిరం ఎదురుగా ఉన్న అన్నప్రసాదాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుసాయి మాట్లాడుతూ భక్తులకు మార్గమధ్యలో అల్పాహారం ఉంటుందన్నారు. మధ్యాహ్నం గొలగమూడిలో అన్నప్రసాదం స్వీకరించిన తిరుగు ప్రయాణం ఉంటుందన్నారు. సాయిదర్బార్ సత్సంగ్ సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

సుధాకర్‌రావుకు సన్మానం



నెల్లూరు (టౌన్) : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న పొదలకూరు డీఎన్నార్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న ఏవీ సుధాకర్‌రావును స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. వి.ఫణికుమార్, సురేఖ, మస్తానయ్య పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్) : ఇంటి ముందు ఉన్న బైక్ చోరీకి గురైన ఘటనపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. అరవిందనగర్‌కు చెందిన జయరామిరెడ్డి నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నారు. ఆయన తన బంధువు బైక్‌ను గతనెల 24వ తేదీ రాత్రి ఇంటి ముందు పార్క్‌చేసి నిద్రపోయారు. పక్కరోజు చూడగా బైక్ కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

- నెల్లూరు సిటీ : నారాయణ ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చిన వ్యక్తి బైక్ చోరీకి గురికావడంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఒంగోలులో ఉంటున్న పృథ్వీరాజ్ ఈనెల 8న బైక్‌పై నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చారు. హాస్పిటల్ ప్రాంగణంలో బైక్‌ను ఉంచారు. వైద్యం చేయించుకున్న తరువాత వచ్చి చూడగా బైక్ మాయమైంది. పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

గ్రామోత్సవ క్రీడలు వాయిదా

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఈనెల 16, 17వ తేదీల్లో జరగాల్సిన గ్రామోత్సవ క్రీడలను వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు నిర్వాహకులు బ్రహ్మ, గణేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



అవార్డులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో బాలల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యువజన సర్వీసులశాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.శ్రీనివాసరావు విచ్చేశారు. ఈ సందర్భంగా 25 మంది ప్రతిభ గల విద్యార్థులకు చాచా నెహ్రూ చెకుముకి అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీఆర్ స్కూల్ కరస్పాండెంట్ అందె శ్రీనివాసులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు బి.మురళీకృష్ణ, ఎస్వీ రమేష్‌బాబు, షేక్.రియాజ్‌బాషా, నిర్వాహకులు మురళీమోహన్‌రాజు, రాచపాళెం రఘు, చీదరాల చెన్నయ్య, అరవ రాయప్ప, కరాటే మాస్టర్ ఆదినారాయణ, కేవీ రమణ పాల్గొన్నారు.

ప్రజాసేవలో సహకార బ్యాంకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : సహకార బ్యాంకులు నగర ప్రజలకు నమ్మకమైన సేవలు అందిస్తున్నట్లు జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) గుర్రప్ప అన్నారు. నగరంలోని ది నెల్లూరు కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌లో రెండో రోజు శుక్రవారం సహకార వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గుర్రప్ప, బ్యాంక్ చైర్మన్ నాగేంద్రసాయి హాజరై, మాట్లాడారు. ది నెల్లూరు కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 108 ఏళ్లుగా ఖాతాదారులకు, సభ్యులకు మెరుగైన నమ్మకమైన సేవలు అందిస్తూ నగర ప్రజల మన్ననలు పొందుతున్నట్లు తెలియజేశారు. అనంతరం సహకార సంఘాల్లో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆడిట్ అధికారి తిరుపతయ్య, డీసీఎల్ఓ సుధాభారతి, బ్యాంక్ సీఈఓ అనిత పాల్గొన్నారు.

➡ నగరంలోని గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ కార్యాయలంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓ గుర్రప్ప మాట్లాడుతూ, సంఘాల్లో నిరుపేద గొర్రెల పెంపకందారులను చేర్పుకోవాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి

నెల్లూరు రూరల్ : బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి పిలుపునిచ్చారు. నగరంలోని కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో కోవూరు నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బూత్ కన్వీనర్లు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు చేయించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ ఈఈ శ్రీధర్ శుక్రవారం తెలిపారు.

➡ తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలో శాంతినగర్, ఏవీకే ఎస్టేట్, సంజయ్‌గాంధీ నగర్, డైకస్‌రోడ్డు, జేకే కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ, ఇందిరాగాంధీ నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదు.

➡ బీవీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో బీవీనగర్, పడారుపల్లి, మాగుంట లేఅవుట్, సప్తగిరి కాలనీ, సుందరయ్య కాలనీ, కావేరి నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 11.30 వరకు అంతరాయాలు ఉంటాయి.

➡ నవాబుపేట రైతుబజారు సబ్‌స్టేషన్ పరిధిలో నజీర్‌తోట, కృష్ణానగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదు.

➡ గోమతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గోమతి నగర్, హరనాథపురం, సర్వేపల్లి కాలువకట్ట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట సరఫరా ఉండదు.

మహాధర్నాకు తరలిరావాలి

నెల్లూరు (టౌన్) : కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ ఈనెల 18న విజయవాడలోని ధర్నాచౌక్‌లో తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వెన్ను నరేంద్ర తెలిపారు. నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలను బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. జీఓ నంబర్ 77ను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన, తల్లికి వందనం పథకాలను అమలు చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు జీవన్, పవన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

18న వలంటీర్ల ధర్నా

నెల్లూరు రూరల్ : ఈనెల 18న జిల్లా వలంటీర్ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్.హుమాయున్‌బాషా, జిల్లా అధ్యక్షురాలు రుక్మిణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం నుంచి వలంటీర్లు తమ నిరసన తెలుపుకుంటూ కలెక్టరేట్ వద్దకు చేరుకుని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తామన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజీనామా చేసిన వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని ధర్నాకు పిలుపునిచ్చినట్లు తెలియజేశారు. వలంటీర్లు తప్పక పాల్గొనాలని కోరారు.

మండల పూజకు అంకురార్పణ



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో మండల పూజోత్సవాలకు శుక్రవారం రాత్రి అంకురార్పణ చేశారు. తొలుత పడిపూజ గావించారు. కార్యక్రమాలను శ్రీస్వామిఅయ్యప్ప సేవా సమాజం పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, సభ్యులు పర్యవేక్షించారు.

న్యాయం చేయాలని వినతి

నెల్లూరు రూరల్ : తన రైస్‌మిల్లుతో సహా ఆక్వా తయారీ యూనిట్‌ను కబ్జా చేసేందుకు యత్నించి తనపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇందుకూరుపేట మండలం ఆదెమ్మసత్రానికి చెందిన మద్దినేని రవీంద్రబాబు కోరారు. నెల్లూరులోని జర్నలిస్టు భవన్‌లో ఆయన శుక్రవారం మాట్లాడారు. శ్రీధర్ సత్యంనాయుడు, మధునాయుడు, రాజేష్, మౌర్య అనే వ్యక్తులు తనపై హత్యాయత్నం చేశారన్నారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.